ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

సోమవారం 9 జూన్ 2025



అడ్లూరికి అమాత్య పదవి

- నిరాశలో 'కవ్వంపల్లి' శిబిరం
- ఉమ్మడి జిల్లా నుంచి మూడో మంత్రి
- ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాదిన్నరలో విప్, మంత్రి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు మరో మంత్రి పదవి దక్కింది. ధర్మపురి శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మంత్రి పదవి వరించింది. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాదిన్నరలో ఆయన మంత్రి అయ్యారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీని నమ్ముకుని ఉన్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విధేయతను అధిష్ఠానం గుర్తించింది. ఐదుసార్లు ఓటమిపాలైనా పట్టు విడవకుండా 2023ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రివర్గంలో ఉండగా ఇప్పుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్థానం సంపాదించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

7

ధర్మపురిలో సంబరాలు



ధర్మపురిలో స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మపురి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి రావడంపై ధర్మపురి పట్టణంలో కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు కలిసి స్థానిక శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించారు. అనంతరం హైదరా బాద్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పలు వాహనాలు ద్వారా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీపీ సీసీసభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం తిరుపతి, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ రఫియొద్దీన్, అక్కపెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, ధర్మకర్తలు రాపర్తి సాయికుమార్, కొమిరెల్లి పవన్‌కుమార్, బొల్లారపు పోచయ్య, స్తంభంకాడి గణేష్, బాదినేని వెంకటేష్, ఒజ్జల లక్ష్మణ్, ఆశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు హైదరా బాద్‌లోని మిని స్టర్ క్వార్టర్స్‌లో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు కలిసి స్వామి ప్రసాదం, చిత్రపటం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అడ్లూరికి గవర్నర్, సీఎం అభినందనలు

మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డిలు పుష్పగుచ్ఛాలు అందించి ప్రత్యే కంగా అభినందించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసే ముందు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాద పూర్వకంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రిదుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆలింగనం చేసుకున్నారు.

నేటి ప్రజావాణి రద్దు

జగిత్యాల , జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నిర్వహిస్తున్న భూ భారతి అవగాహన సదస్సులు జిల్లాలోని అన్ని మండలాలలో జరుగుతున్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నామని ప్రజలు ఎవరు వినతులు తీసుకుని కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పేదవారి స్వంత ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కట్లకుంట, మేడిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదివారం విప్ భూమి పూజ చేశారు. అనంతరం ఉమ్మడి మండల పరి దిలో 67 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, బొంగోని రాజాగౌడ్, నాగ రాజు,బలగం రాజేష్, శంకర్, కొమురయ్య, రాజేందర్ పటేల్, నర్సరెడ్డి తది తరులు పాల్గొన్నారు.

14 నుంచి బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక



మాట్లాడుతున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): షటిల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర ఛాంపియన్స్ కోసం క్రీడాకారులను ఈనెల 14,15 తేదీల్లో జగిత్యాల క్లబ్‌లో ఎంపిక చేస్తామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జిల్లాలు ఏర్పడిన తర్వాత జగిత్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ఈసమావేశంలో అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ రామకృష్ణారావు, రాంమోహన్‌రావు, శ్రీనివాస్, వెంకట రమణ, మహేందర్, విజయ్‌కుమార్, కిషోర్‌కుమార్, మహేష్, నవీన్‌కుమార్ తదితరులున్నారు.

'ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి సమష్టి కృషి'



మేడిపల్లి కళాశాలను సందర్శిస్తున్న అధ్యాపకుల సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెమిడి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం మేడిపల్లి మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని ఆయన సందర్శించారు. అనంతరం జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నతి కోసం ప్రభుత్వం నూతన జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేస్తోందన్నారు.

ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండో ఇంక్రిమెంట్‌ను వెంటనే ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన వెంట తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతి రెడ్డి, అత్తినేని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

జగిత్యాల అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద ఆర్యవైశ్యుడు ముత్యపు అభిలాష్‌కు జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ, ఆవోప అధ్యక్షుడు రాజేశుని శ్రీనివాస్ ఆదివారం 63,639 రూపాయలను ఆర్థిక సహాయం అందించాడు.

మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో దిగుతుండగా అభిలాష్‌కు ఫిట్స్ వచ్చి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో జగిత్యాల పట్టణంలోని స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో ఎస్‌బీ సీఐ ఆరీఫ్ అలీ ఖాన్ చేతుల మీదుగా 63,639 రూపాయలను బాధితుడి తమ్ముడికి అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని తక్కళ్లపల్లి ఫీడర్ వద్ద చెట్ల కొమ్మలు తొలగించడం జరుగుతుందని దీంతో మల్యాల సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మల్యాల గ్రామ పరిదిలో వ్యవసాయ బావులకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హిందూ సామ్రాజ్యవాద దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

రాయికల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో ఆదివారం సంఘమిత్ర యూత్, శివాజీ రైతు యువజన సంఘం ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్యవాద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి కాషాయ జెండాను ఎగురవేశారు. అనం తరం వక్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేల్పుల గంగరాజంను సన్మానించారు. కార్యక్రమంలో కురుమ సుదర్శన్, నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పటేల్ శివారెడ్డి, పాలడుగు అనిల్, మోహన్ రెడ్డి, కిషోర్, జలపతి రెడ్డి, తూపారపు రవి, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాగంటి మృతి తీరని లోటు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో సేవలందించిన మాగంటి అకస్మాత్తుగా దూరమవడం విచారకరం అన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా శాఖ పక్షాన వారి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

●జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపినాథ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీవ్ర ఆవేదనను మిగిల్చిందని జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



సిరికొండలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కథలాపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం సిరికొండలో ఆదివారం పెద్దమ్మతల్లి బోనాల జాతర ఘనంగా జరిగింది. ముదిరాజ్ సంఘం 2 ఆధ్వర్యంలో ఇంటికొకరు చొప్పున అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పించారు. డప్పు చప్పుళ్లతో గ్రామ వీధుల వెంట బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. యువకులు, మహిళలు, చిన్నారులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వర్షాలు పుష్కలంగా కురిసి పాడిపంటలు పండాలని కోరుకున్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని ముదిరాజ్ కులస్తు లు ఆదివారం పెద్దమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహిం చారు. గ్రామంలోని ముదిరాజ్ కుల మహిళలు కుటుంబ సభ్యులతో బోనాలను ఎత్తుకొని గ్రామ శివా రులో ఉన్న పెద్దమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని కోరుకుంటు పెద్దమ్మ దేవతకు నైవేద్యం సమ ర్పించి, మొక్కులను చెల్లించుకు న్నారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు, సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

●**రాయికల్:** మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఆదివారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, సంఘం నాయకులు కట్కం సతీష్, బోగ సత్తయ్య, వెంకటాద్రి, మహేష్, సాగర్, గంగాధర్, పృథ్వి, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.



కొడిమ్యాలలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య'



పాషిగామలో బడి బాటలో పాల్గొన్న ఎంఈవో ప్రభాకర్, ఉపాధ్యాయులు

వెల్గటూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి ప్రభాకర్ పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం పాషిగామ గ్రామాన్ని సందర్శించి విద్యార్థుల నమోదులో స్ఫూర్తిగా నిలుస్తున్న నీలం సంపత్‌కుమార్, మహేష్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను పూర్తిగా బంద్ చేసి, గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు పంపాలని తీర్మానించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల వైపు గ్రామాల్లో అడుగులు పడుతున్నాయన్నారు. మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల యొక్క నమోదు పెరిగిందని తెలిపారు. అదేవిధంగా మూతబడిన కుమ్మరిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో పర్యటించి గ్రామస్తుల సహకారంతో వాటిని కూడా పునః ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బర్పటి జనార్ధన్, గోపతి నరేష్, పోడేటి సతీష్, ప్రశాంత్, రాజు, మహిళా సమాఖ్య ప్రతినిధులు ప్రమీల, వనిత, అనుషా, లావణ్య, లత, రజిత, దివ్య అంగన్వాడి టీచర్ రాజేశ్వరి, ఆశా కార్యకర్త జ్యోతి, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వామ్మో జూన్..



- పేద, మధ్య తరగతి కుటుంబాల్లో గుబులు
- 12 నుంచి ప్రారంభం కానున్న పాఠశాలలు
- పొలం బాట పట్టనున్న రైతులు
- రెండు వైపులా ఖర్చులు

జగిత్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జూన్ నెల వచ్చిందంటేనే పేద, మధ్య తరగతి కుటుంబాలకు గుబులు మొదలవుతుంది. ఓ వైపు పాఠశాలలు ప్రారంభం కానుండడం, మరోవైపు సాగు పనులు, ఇంకొక వైపు వైరల్ జ్వరాల ముప్పు పొంచి ఉండడం వెరసి సగటు జీవిపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. మరో నాలుగు రోజుల్లో బడి గంట మోగనుంది. ఇన్నాళ్లు ఆట పాటల్లో మునిగిన విద్యార్థులు బడి బాట పట్టనున్నారు. ఈనెల 12న పాఠశాలలు తెరుచుకోనుండటంతో తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. పిల్లలను బడుల్లో చేర్పించడం, ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, ట్రంకు పెట్టెలు, బ్యాగులు, టై, బెల్టు, షూస్, ఇతర స్టేషనరీ, రవాణా చార్జీల వంటివి ఉంటాయి, వీటికే వేలాది రూపాయాలు వెచ్చించాలి. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పెరిగిన ఫీజులను చూసి తల్లిదండ్రులు జడుసుకుంటున్నారు. కొన్ని స్కూళ్లలో ఎల్‌కేజీ విద్యార్థులకే రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో 60 శాతం ఫీజు మొదలే చెల్లించాల్సి ఉంటుంది.

● రైతులకు పెట్టుబడి భారం..

జూన్ నెల వచ్చిందంటే రైతుల పైనా భారం ఉంటుంది. ఈ సమయంలోనే వ్యవసాయ పనులు ప్రారంభం అవుతాయి. ఇప్పటికే తొలకరి వర్షాలు కురవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు దున్నడం, కూలీలు ఇతర వాటికి ఖర్చులు ఉంటాయి. మొత్తంగా సీజన్ ప్రారంభంలో ఎకరాకు కనీసం రూ.10 వేలైనా ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో పలువురు రైతులు పెట్టుబడి కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపా రులను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు విత్తనాలు, ఎరువుల ధరలు ఈ యేడాది అమాంతంగా పెరగడం రైతులకు మరింత భారంగా మారనుంది.

● పొంచి ఉన్న వ్యాధుల ముప్పు..

వర్షాకాలం వచ్చిందంటే చాలు వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది. పరిశుభ్రత లోపించడం, మురుగు నీరు ఇళ్లలోకి రావడం, మురికి కాలువలు శుభ్రంగా లేకపోవడం, చెత్తాచెదారం పేరుకపోవడం తదితర కారణాలతో దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెందుతాయి. దీంతో విష జ్వరాలు రావడం వ్యాప్తి చెందడం వంటివి చోటుచేసుకుంటాయి. వాతావరణ పరిస్థితులు మారుతుండడం ..

ఒక్కో విద్యార్థికి అయ్యే ఖర్చు...

మొదటి విడత స్కూలు ఫీజు	రూ.10 వేల నుంచి రూ.25 వేలు
పుస్తకాలు...	రూ.5 వేల నుంచి రూ.7 వేలు
రెండు జతల యూనిఫాంలు..	రూ.2 వేల నుంచి రూ.2,500
ట్రాన్స్‌పోర్టు చార్జీ (నెలకు)..	రూ.1000 నుంచి రూ.1,500
స్కూలు బ్యాగు, స్టేషనరీ...	రూ.1000 నుంచి రూ.1,500

మిగతా 8లో

33 తులాల బంగారం చోరీ

గంగాధర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో ఆదివారం 33తులాల బంగారం చోరీకి గురైనట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పుగండ్ల గంగారెడ్డి మంచినీరు తీసుకురావడానికి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. వాటర్ ప్లాంటు నుంచి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా అందులో దాచిన 33 తులాల బంగారంతో పాటు వెండి, నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

పాలకుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో చోరీ జరిగింది. అమ్మవారి మెడలోని పుస్తెలు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆదివారం ఉదయం గుడిని శుభ్రం చేసేందుకు వెళ్లిన ముదిరాజ్ కులసంఘం అధ్యక్షుడు నర్సయ్య వెళ్లగా గుడి తాళం పగులగొట్టి ఉండడంతో బసంత్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

గోవధకు పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎలాంటి అనుమతి లేకుండా గోవధకు పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఎండీ జహంగీర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ ఆదివారం తెలిపారు. గ్రామ శివారులో ఈ నెల 7న గోవధ జరుగుతోందనే సమాచారంతో అక్కడకు చేరుకున్నామని పేర్కొన్నారు. పశు వైద్యాధికారులు పంచనామా నిర్వహించారని చెప్పారు. పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ శ్రీధర్ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ వివరించారు.

బాలుడి అదృశ్యం

జగిత్యాల క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణినగర్ ప్రాంతానికి చెందిన సాయి గణేష్(12) అనే బాలుడు ఆదివారం అదృశ్యం అయ్యాడు. గణేష్ తనఇంటి నుంచి ఆదివారం ఉదయం సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. బాలుడి తండ్రి ర్యాకలఅంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మృతుడి గుర్తింపు

కరీంనగర్ క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కాంప్లెక్స్ వద్ద శనివారం లభించిన మృతుడు గాంధీరోడ్‌కు చెందిన బోనాల సదానందం(60)గా కుటుంబసభ్యులు గుర్తించినట్లు కరీంనగర్ ఒకటోఠాణా పోలీసులు తెలిపారు. మృతుడి ఫొటో పత్రికల్లో గుర్తించిన సదానందం కొడుకు నరేష్ పోలీసులను సంప్రదించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.



పిచ్చిచెట్లతో నిండిన కాలువ, పూడిక తీసిన తరువాత కాలువ

చివరి భూములకు నీరందేలా..

- ఉపాధిహామీ పనుల్లో పూడికతీత పనులు
- డి86, డి83 ప్రధాన కాలువలలో చెట్ల తొలగింపు

సుల్తానాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టు చివరి భూములకు నీరందేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఎస్సారెస్పీ కాలువలను శుభ్రం చేయించే పనులు చేపట్టారు.

కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయ రమణారావు ఆదేశాలతో కాలువలను శుభ్రం చేయించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రతీ వేసవిలో ఉపాధిహామీ కూలీలతో పలు పనులు చేపట్టడం ఆనవాయితీ. ఈ సారి శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన డీ 86, డీ 83 ప్రధాన కాలువలు, మైనర్, సబ్ మైనర్‌తోపాటు ఫీల్డ్ చానల్స్‌లో చెత్తాచెదారం లేకుండా తొలగిస్తున్నారు. కాలువల ద్వారా ఉన్న అడ్డంకులు తొలగిస్తూ సాగునీరు సాఫీగా చివరి భూములకు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. నీటి పారుదల శాఖ అధికారులతో చర్చించి కాలువల పూడికతీత అవసరం ఎక్కడెక్కడ ఉందో అందుకు తగిన పనుల ప్రతిపాదనలు కలెక్టర్ తెప్పించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం ద్వారా ఈ రెండు ప్రధాన కాలువలలో పూడిక తీత పనులకు ప్రణాళికలు రూపొందించారు.

గత నెల 19న పనులను ప్రారంభించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం, చెట్లను తొలగిస్తున్నారు. ఈ పనులను కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. సుద్దాల గ్రామంలో జరుగుతున్న పనులను కలెక్టర్ పర్యవేక్షించి అధికారులకు సూచనలు అందించారు.

కలెక్టర్ చొరవతో పనులు

కాళిందిని దేవి, డీఆర్‌డీఓ పెద్దపల్లి



ఎమ్మెల్యే సూచనల మేరకు, కలెక్టర్ ఆదేశాలతో ఈ ప్రాంత రైతుల ప్రయోజనార్థం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలువలలో పూడిక తీత పనులు పైలట్ ప్రాజెక్ట్‌గా చేప ట్టాం. జిల్లాలలోని 13 మండలాల్లో 163 గ్రామాలలో మొత్తం 350 పనులకు శాంక్షన్ ఇవ్వడం జరిగింది. మే 19 నుంచి జిల్లాలో పూడిక తీత పనులు చేపట్టాం. ప్రస్తుతం 89 శాతం పనులు పూర్తయ్యాయి. కాలువల ద్వారా నీరు సాఫీగా చివరి భూములకు వెళ్ళేలా కాలువలను తీర్చిదిద్దడం లక్ష్యంగా పనులు చేయిస్తున్నాం.

ప్రతీ రోజు పనులు పర్యవేక్షిస్తున్నాం

దివ్యదర్శన్ రావు, ఎంపీడీవో



సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి నుంచి రేగడిమద్దికుంట వరకు ఉన్న డీ 86 ప్రధాన కాలువ, అలాగే నారాయణపూర్ కొదురుపాక వరకు ఉన్న డీ 83 ప్రధాన కాలువల పూడిక తీత పనులను రోజు పర్యవేక్షిస్తున్నాం. ఉప కాలువలు కూడా శుభ్రం చేయిస్తున్నాం. రోజు 1800 నుంచి 2000 మంది ఉపాధిహామీ కూలీలతో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. 27 గ్రామాల పరిధిలోని అన్ని రకాల కాలువలలో పూడికతీత, చెత్త తొలగింపు, పిచ్చి చెట్లు పొదలను తొల గించే పనులు పూర్తి కావచ్చాయి. ఈ పనులు పూర్తయితే ప్రధాన కాలువ ద్వారా కాలువ చివరి భూములకు ఎలాంటి అడ్డంకులు లేకుండా నీరు చేరుతుంది.

కారు బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామ శివారులో జాతీయ రహదారిపై కారు బైక్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఎదురుగా బైక్‌పై వస్తున్న రాజాపూర్ గ్రామానికి చెందిన మాతంగి ప్రభాకర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ప్రభాకర్ ఎడమ కాలికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులు, 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే ప్రభాకర్‌ను 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

ధర్మపురి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం తిమ్మాపూర్ రహదారివద్ద ఆదివారం కారుఢీకొట్టిన ప్రమాదంలో సబ్బ సత్తయ్య అనేవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సబ్బ సత్తయ్య పని నిమిత్తం తన బైక్‌పై ధర్మపురి వైపు వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న ఏపీ 09 సీఎల్ 4884 అనేనంబర్ గల కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో సత్తయ్య కాలు ఫ్రాక్చర్ కాగా చికిత్స కోసం జగిత్యాల ఆసు పత్రికి తరలించారు.

యువకుడిపై దాడి

- తలకు గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- సోషల్ మీడియాలో పోస్టుల కారణంగా దాడి: బాధితుడు

మంథని, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికిచెందిన బొల్లపల్లి సంతోష్ గౌడ్ అనే యువకుడిపై స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాల గ్రౌండ్ లో శనివారం రాత్రి దుండగులు దాడి చేశారు. సంతోష్‌గౌడ్ మూత్రవిసర్జన కోసం గ్రౌండ్‌లో వెళ్ళగా కారు, రెండు ద్విచక్ర వాహనాల పై వచ్చిన దుండగులు కత్తులు, రాడ్లతో దాడికి పాల్పడ్డారు. వారి దాడిలో తలకు, భుజాలకు గాయాలయ్యాయి. సంతోష్‌గౌడ్ అరవడంతో గ్రౌండ్‌లో ఉన్న వారి సమాచారంతో పోలీసులు అక్కడి చేరుకున్నారు. అప్పటికే దుండగులు వెళ్ళిపోయారు. గాయపడ్డ సంతోష్‌గౌడ్‌ను పోలీసులు మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళి ప్రథమ అనంతరం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. మంథని ప్రాంతంలో జరుగుతున్న పలుఅవినీతి, అక్ర మాలు, కొందరు రాజకీయ నేతల, అధికారులు, పోలీసుల అధికారుల దౌర్జన్యాలపై సోషల్ మీడియాలో తరుచూ పోస్టులు పెట్టడంతోనే తనపై కక్షగట్టి దాడికి పాల్పడినట్లు బాధితుడు సంతోష్ గౌడ్ ఆరోపిస్తున్నాడు. సమాచార హక్కు చట్టం ద్వారా ఇసుక, మట్టి ఇతర అక్రమ దందాలపై వివరాలు సేకరిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కాంగ్రెస్ నేత సదానందం తనపై దాడి చేయించాడని ఆరోపించారు. ఇలాంటి అక్రమాలకు పోలీసులు కొమ్ము కాస్తున్నారని, కొందరు పోలీసు అధికారులు తనను చాలాసార్లు బెదిరించారని ఆరోపించారు. గోదావరిఖని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్‌గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. దాడి ఘటన పై పోలీసులు విచారణ జరుపుతున్నారు.



దాడిలో గాయపడ్డ సంతోష్‌గౌడ్

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు(65) మృతి చెందాడని కరీంనగర్ రెండోఠాణా పోలీసులు తెలిపారు. 10 రోజుల కిందట ఆసుపత్రిలో చేరిన వృద్ధుడు ఆదివారం మృతి చెందాడని తెలిపారు. మృతుడిని గుర్తించినవారు రెండో ఠాణా లేదా ప్రభుత్వ ఆసుపత్రిలోని అవుట్‌పోస్ట్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

విష జ్వరంతో మూడేళ్ల చిన్నారి మృతి



హిమాన్వి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో మోతుకు హిమాన్వి(3) అనే చిన్నారి విషజ్వరంతో ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. మోతుకు రవళి-రామచంద్రం దంపతుల కూతురు హిమాన్వి రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధ పడుతోంది. కుటుంబ సభ్యులు స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమించిందని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించాలని సూచించాడు. వెంటనే హిమాన్విని తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు చెప్పారు. దీంతో కరీంనగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్న క్రమంలో చిన్నారి హిమాన్వి చనిపోయింది. రామచంద్రం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లగా, రవళి ఇంటి వద్ద బీడీలు చుడుతుంది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



తిరుపతి(ఫైల్)

పాలకుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బసంత్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముంజంపల్లి గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన బొమ్మగాని తిరుపతి(29) ఉపాధిహామీ మేటుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతని కొడుకుకు ఎలక్ట్రికల్ ట్రిమ్మర్‌తో కటింగ్ చేసేందుకు బాతురూంలోని చార్జింగ్ పాయింట్ వద్ద చార్జింగ్ పెడుతుండగా కరెంటుషాక్ తగిలి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ధర్మారంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడివైద్యులు మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ వెళ్లాలని సూచించారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య బొమ్మగాని రేణుక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ స్వామి తెలిపారు. తిరుపతికి కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెద్దపల్లి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి రజిత (30) అనే వివాహిత చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 6న రజిత భర్త రవికుమార్‌తో గొడవ జరుగగా క్షణికావేశంలో ఈనెల 7న ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తండ్రి కొత్తకొండ పోషం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో బూత్కూరి నవీన్(26) అనే యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక అన్నపూర్ణ కాలనీకి చెందిన నవీన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా బలవన్మరణానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు పోసుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వ్యవసాయబావిలో దూకి వృద్ధురాలి బలవన్మరణం

మానకొండూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన తొర్రికొండ రాజమ్మ(76) ఆదివారం వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజమ్మ నాలుగేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుట పడలేదు. దీంతో జీవితంపై విరక్తిచెంది గ్రామంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కూతురు రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



తిరుపతిగౌడ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామాల మధ్య ఈనెల 7న రాత్రి అదుపు తప్పి ఆటో బోల్తా పడిన సంఘటనలో మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ నాగుల తిరుపతిగౌడ్(40) కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడని కుటుంబ సభ్యులు, పోలీసులు ఆదివారం తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని తిరుపతిగౌడ్ ఆటో నడుపుతూ జీవిస్తుండేవాడు. ఈనెల 7నరాత్రి తన ఆటోలో ప్రయాణీకులను ఎక్కించుకుని ఎల్లారెడ్డిపేట నుంచి రాచర్లగొల్లపల్లికి బయలుదేరాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. తీవ్ర గాయాల పాలైన అతన్ని మొదట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. మృతుడికి భార్య కీర్తి, తల్లిదండ్రులు వజ్రమ్మ, రంగయ్యలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. ఆటో డ్రైవర్ తిరుపతిగౌడ్ మృతి వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సుభాష్, పర్శరాములు, ప్రదీప్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, నర్సయ్య, బుచ్చాగౌడ్ తదితరులు సిరిసిల్లలోని ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నాంపల్లి గుట్టపై ములుగు జిల్లావాసి మృతి



రాజు (ఫైల్)

వేములవాడ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గుట్టపై ములుగు జిల్లా వాసి మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి మండలం భూపాల్‌నగర్ (పందికుంట)కు చెందిన సాదం సమ్మయ్యకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు సాదం రాజు(32) ఈనెల4వ తేదిన దైవ దర్శనానికి వెళ్లి వస్తానని ఇంటి నుండి బయలుదేరాడు. ఆదివారం ఉదయం నుంచి రాజు ఎంతకూ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి బంధువులు గాలించడం ప్రారంభించారు. శనివారం రాత్రి తమ సమీప బంధువుకు నాంపల్లి గుట్టకు వెళుతున్నట్లు చెప్పడంతో బంధువులతో కలిసి నాంపల్లి గుట్టకు వెళ్లి వెతికారు. నాంపల్లి ధర్మగుండం సమీపంలో రాజుకు సంబంధించిన బ్యాగు, చెప్పులు, పర్సు లభించాయి. అనుమానంతో కోనేరులో వెతుకగా రాజు మృతదేహం లభ్యమైంది. బంధువులు వేములవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రాజు మృతికి గల వివరాలు తెలియరాలేదు.

ద్విచక్రవాహనానికి మంటలు

హుజూరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనానికి మంటలు అంటుకోవడంతో పెనుప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని రియల్స్ మార్ట్‌ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనానికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గమనించిన మార్ట్ సిబ్బంది వెంటనే ఫైర్‌ఎక్స్‌టింగ్ యూషర్స్‌లతో మంటలను ఆర్పేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం స్వల్పంగా దగ్ధమైంది.

పూడ్చిన మృతదేహం వెలికితీత

- కుటుంబ సభ్యులకు అప్పగింత

మల్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో హత్యకు గురైన ఉప్పు రమణారెడ్డి (30) మృతదేహాన్ని గోతి నుంచి పోలీసులు వెలికి తీశారు. సోమవారం హత్యకు పాల్పడిన అనంతరం కొందరు యువకులు కొండగట్టు మెట్లదారి పక్కన గల ఉపాధిహామీ కందకాల్లో పూడ్చివేయగా శనివారం ఈ విషయం కలకలం రేపింది. దీంతో మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఆదివారం పూడ్చిపెట్టిన గోతి నుంచి మృతదేహం వెలికితీశారు. తహసీల్దార్ వసంత, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ సమక్షంలో అక్కడే వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా మళ్లీ అదే ప్రాంతంలో పూడ్చివేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సోమవారం వెల్లడించనున్నట్లు సీఐ నీలం రవి తెలిపారు. కొందరు కక్షతోనే తన తమ్ముడిని కొట్టి చంపారని మృతుడి సోదరుడు నిరంజన్‌రెడ్డి ఆరోపించాడు.



మృతదేహాన్ని వెలికితీస్తున్న కూలీలు

ఆరేళ్లుగా తెరుచుకోని ప్రభుత్వ పాఠశాల

- ఇబ్బందులు పడుతున్న పిల్లలు, తల్లిదండ్రులు

కోనరావుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మారుమూల తండాలో ప్రభుత్వ పాఠశాల మూతపడడంతో గిరిజనుల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాలో ప్రభుత్వ పాఠశాల ఆరు సంవత్సరాల క్రితం మూతపడింది. అప్పటినుంచి పిల్లల తల్లిదండ్రులు బావుసాయిపేటతో పాటు వేములవాడ పట్టణంలోని ప్రైవేట్‌పాఠశాలలకు విద్యార్థులను పంపిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. గోవిందరావుపేట తండాలో సుమారు గిరిజనవిద్యార్థులు 40మంది విద్యార్థులు ఉన్నారు. గోవిందరావుపేటలో తరగతి వరకు చదువు నేర్చుకోవడానికి ప్రభుత్వ పాఠశాలలతోపాటు అన్ని వసతులు కల్పించారు. మాజీసర్పంచ్ రజితజగన్ నాయక్ తిరిగి ప్రారంభించివిద్యను అందించాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మధ్యనే ప్రభుత్వం నిర్వహిస్తున్న బడిబాటలో ఉపాధ్యాయులు గోవిందరావుపేట తండాకు వెళ్లి విద్యార్థులను బావుసాయిపేట ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. కానీ పిల్లల తల్లిదండ్రులు గోవిందరావుపేట ప్రభుత్వ పాఠశాలను తిరిగి ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బావుసాయిపేటకు పంపించాలంటే సుమారు రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోవిందరావుపేట ప్రభుత్వ పాఠశాల మూత పడడంతో పాఠశాల భవనాన్ని గ్రామపంచాయతీకి వాడుకుంటున్నారు. అందులోనే గ్రామపంచాయతీ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాధికారి స్పందించి గోవిందరావుపేట తండాలోని ప్రభుత్వ పాఠశాలను పునః ప్రారంభిస్తే విద్యార్థులను పంపిస్తామని గోవిందరావుపేట గిరిజనులు తెలుపుతున్నారు.



గ్రామపంచాయతీ భవనంగా మార్చిన గోవిందరావుపేట తండాలోని పాఠశాల

గోవిందరావుపేట ప్రభుత్వ పాఠశాలను పునఃప్రారంభించాలి

- రజితజగన్‌నాయక్, మాజీ సర్పంచ్



గోవిందరావుపేట తండాలో అన్ని వసతులతో ప్రభుత్వపాఠశాల ఉంది. విద్యార్థులు సుమారు 30మంది చదువుకోడానికి సిద్ధంగా ఉన్నారు. ఉపాధ్యాయులను కేటాయించి ప్రభుత్వపాఠశాలను ప్రారంభిస్తే అందుబాటులోకి వస్తుంది.

చదువు కోసం ఇబ్బందులు పడుతున్నాం

- గుగులోతు ఆసిలాల్



గోవిందరావుపేట తండాలో ప్రభుత్వం పాఠశాల మూతపడడంతో పిల్లల చదువు కోసం ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ పాఠశాల మూతపడి ఆరు సంవత్సరాలు అవుతుంది. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను కేటా యించి ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించాలి.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

జగిత్యాల క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లతో అప్పులపాలై గడ్డిమందు సేవించి ఆత్మహత్యకు యత్నించిన వరద సాయి కుమార్(28) అనేయువకుడు ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. జగిత్యాల పట్టణంలోని హన్మాన్‌వాడకు చెందిన సాయి కుమార్ జగిత్యాలలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసయ్యాడు. నిరుపేద కుటుంబం కావడంతో పాటు ఆన్‌లైన్ గేమ్ కోసం పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో రూ.5 లక్షలకు పైగా అప్పుల పాలయ్యాడు. తీవ్ర మనస్థాపానికి గురైన సాయికుమార్ మే 28న తనఇంటి సమీపంలో గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులను, ట్రోఫీలను ప్రదానం చేస్తున్న సాన్వి ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రేకుర్తిలోని సాన్విజూనియర్ కళాశాల ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్ రెండు విభాగాల్లో నిర్వహించగా మొదటి విభాగం 35 ప్లస్ విభాగంలో 100 మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలుగా శరత్ కుమార్, శ్రీకాంత్(హుజూరాబాద్)లు నిలిచారు. రన్నర్లుగా చారి, రాజు(కరీంనగర్)లు నిలిచారు. అలాగే అండర్-18 బాలుర విభాగంలో సంజయ్, హర్షవర్దన్ విజేతలుగా నిలవగా, శ్రీజ్ఞాన్, క్షితిజ్ రన్నర్లుగా నిలిచారు. బాలికల విభాగంలో మేఘన, సంజనలు విజేతలుగా నిలవగా, రన్నర్లుగా వైశాలి, హర్షిత నిలిచారు. వీరందరికి సాన్వి విద్యాసంస్థల అధినేత మునీందర్ విజేతలకు మూడు వేల రూపాయలు, రన్నర్లకు రెండు వేల రూపాయలతోపాటు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ గుంటపల్లి స్వామి, మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ సెక్రటరీ బాబు, సభ్యులు కందుకూరి శంకర్, రాజిరెడ్డి, కోచ్‌లు మధుకర్, గంగరాజు, రవి లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సంఘ ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ బాలబాలికల ఎంపిక పోటీలను ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించారు. 40 మంది క్రీడాకారులు పాల్గొనగా ఇందులో ప్రతిభచూపిన జి హరిహర, కె నరేష్, పి సుకుమార్, జి సాకేత్, సిమిత్ర రెడ్డి, శ్రీకర్, పి సాకేత్, వరుణ్, వి హేమ హాసిని, కే పవిత్రలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 10, 11 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వీరిని డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి సత్యనారాయణ, కొత్తకొండ సంపత్‌కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మడిపల్లి కాళీచరణ్, సీనియర్ బాక్సింగ్ క్రీడాకారులు ప్రవీణ్, జగిత్యాల జిల్లా సెక్రటరీ జి శ్రీనివాస్, కోచ్ రామకృష్ణ అభినందించారు.

మల్లన్న జాతరలో భక్తుల కోలాహలం

ఓదెల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శైవ క్షేత్రమైన ఓదెల మల్లన్న జాతరలో ఆదివారం భక్తులు మొక్కులను సమర్పించారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో జాతరకు రావడంతో ఆలయ పరిసరాలన్నీ కోలాహలంగా మారింది. ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం, ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. అలాగే భ్రమరాంబ మల్లికార్జున స్వామికి బోనాలు, కోడెమొక్కులను సమర్పించారు. అనంతరం బంగారు పోచమ్మ, మదన పోచమ్మ ఆలయాలను సందర్శించి మొక్కులను ముట్ట చెప్పారు.



ఆలయంలో ఒగ్గు పూజారులతో పట్నాలు వేయిస్తున్న భక్తులు



రాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేస్తున్న ధర్మపురి ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

అడ్లూరికి అమాత్య పదవి

- నిరాశలో 'కవ్వంపల్లి' శిబిరం
- ఉమ్మడి జిల్లా నుంచి మూడో మంత్రి
- ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాదిన్నరలో విప్, మంత్రి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు మూడో మంత్రి పదవి దక్కింది. ధర్మపురి శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మంత్రి పదవి వరించింది. మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు రాగానే మానకొండూర్ శాసన సభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్లు తెరపైకి వచ్చాయి. చివరి నిమిషం వరకు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకే అవకాశం దక్కుతుందని భావించినా గవర్నర్‌కు మంత్రుల జాబితా వెళ్లే దశలో లక్ష్మణ్ కుమార్ పేరు దానిలో చోటు చేసుకున్నది. దీంతో మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కుమార్ రాష్ట్ర కేబినేట్‌లో మంత్రి పదవిని చేపట్టారు.

పార్టీకి విధేయుడు

ఐదుసార్లు అసెంబ్లీకి పోటీచేసిన విజయం సాధించలేకపోయిన ఆయన మొదటిసారి గెలిచి 18 నెలల కాలంలో అటు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, మంత్రిగా ఎదుగుతూ వచ్చారు. మంత్రి పదవి వచ్చినట్లే వచ్చి చేజారిపోవడంతో కవ్వంపల్లి సత్య నారాయణ, ఆయన వర్గీయులు తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు. ఎన్ఎస్‌యూఐ సభ్యుడిగా విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి వచ్చిన లక్ష్మణ్‌కుమార్ నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను వీడకుండా పార్టీకి విధేయుడిగా ఉంటూ వస్తున్న నేపథ్యంలోనే ఆయనకు మంత్రి పదవి దక్కిందని భావిస్తున్నారు. చెన్నూరు శాసనసభ్యుడు డాక్టర్ వివేక్ వెంకటస్వామికి(మాల)మంత్రి పదవి ఖరారు కాగానే మాదిగ సామాజికవర్గం నుంచి మరొకరిని మంత్రి వర్గంలోకి తీసుకోవాలనుకున్నారు. అప్పుడు కవ్వంపల్లి సత్య నారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్లు పరిశీలనకు వచ్చాయి. సుదీర్ఘకాలంగా పార్టీనే నమ్ముకుని ఉన్న లక్ష్మణ్‌కుమార్‌కు అవకాశం కల్పించినట్లు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాకు మూడు మంత్రి పదవులు...

రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది మంత్రులు ఉండగా అందులో ముగ్గురు ఉమ్మడి జిల్లాకు చెందినవారే కావడం విశేషం. రాష్ట్ర మంత్రి వర్గంలో ఇప్పటికే మంథని శాసనసభ్యుడు డి శ్రీధర్‌బాబు ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రిగా, హుస్నాబాద్ శాసనసభ్యుడు పొన్నం ప్రభాకర్ బీసీ, రవాణాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తుండగా మూడవ మంత్రిగా అడ్లూరి చేరిపోయారు. పెద్దపల్లి జిల్లా నుంచి శ్రీధర్‌బాబు, జగిత్యాల జిల్లా నుంచి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కరీంనగర్ జిల్లా నుంచి పొన్నం ప్రభాకర్ మంత్రులుగా ఉండగా రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా విప్ బాధ్యతల్లో ఉన్నారు. ఈ బాధ్యత నుంచి ఆయనను తప్పించి డాక్టర్ కవ్వంపల్లికి విప్ పదవి ఇచ్చే అవకాశాలున్నాయని చర్చ జరుగుతోంది.

కార్మిక క్షేత్రం నుంచి రాజకీయాల్లోకి..

గోదావరిఖని కార్మిక క్షేత్రం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన లక్ష్మణ్ కుమార్ అక్కడి జూనియర్ కాలేజ్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధా న కార్యదర్శిగా పనిచేశారు. మేడారం అసెంబ్లీ నియోజక వర్గం నుంచి 1999లో పోటీ చేసి మాతంగి నర్సయ్యపై ఓడిపోయారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరిగి ధర్మపురి నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తన నియోజకవర్గాన్ని మార్చుకుని 2009 ఎన్నికల్లో, 2010 ఉప ఎన్నికలో ఆ తర్వాత 2014, 2018లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలయ్యారు.

ఐదుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా పట్టు వదలని విక్ర మార్కుడిలా 2023లో మళ్లీ ధర్మపురి నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఈ విజయం ఆయనకు విప్ పదవిని, ఆ తర్వాత మంత్రి పదవిని తెచ్చింది. 2006లో అడ్లూరి ధర్మారం మండల జడ్పీటీసీగా పోటీ చేసి గెలిచారు. జడ్పీ చైర్మన్‌గా ఉన్న ఆరెపల్లి మోహన్ 2009 ఎన్నికల్లో మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలుపొందగా కొద్ది రోజులపాటు వైస్ చైర్మన్ చైర్మన్ పదవి నిర్వహించారు. ఆ తర్వాత అడ్లూరి చైర్మన్ పదవిని చేపట్టి రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. కొంత కాలం ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచినా 1982 నుంచి ఆయన విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఉంటూ వచ్చి అటు రామగుండం, ఇటు ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గాల్లో విస్తృత సంబంధాలను నెలకొల్పుకున్నారు. ఆ సంబంధాలే ఆయనను క్యాబినేట్‌కు పంపించాయి.



రాష్ట్ర గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

రాజన్న కోడె మృతి

- చికిత్స పొందుతున్న 11 కోడెలు

వేములవాడ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో ఆదివారం మరో కోడెదూడ మృత్యువాత పడినట్లు జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిప్పాపూర్ గోశాలలో 12 కోడెలు చికిత్స పొందుతుండగా, ఆదివారం తెల్లవారుజామున కోడెదూడ మృతిచెందినట్లు తెలిపారు. దీంతో మృతిచెందిన కోడెలసంఖ్య 34కి చేరింది. ప్రస్తుతం 11కోడెలకు పశువైద్యాధికారుల సమక్షంలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజన్న గోశాలలో ఉన్న 1300 కోడెలలో కొత్తగా కోడెలు అనారోగ్యంబారిన పడలేదని పేర్కొన్నారు.

కేంద్రం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చేరవేయాలి

ఖైటింక్లయిన్‌కాలనీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గడిచిన 11ఏళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాలనీ మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్ అన్నారు. ఆదివారం బీఎంఎస్ కార్యాలయంలో జరిగిన మండలస్థాయి కార్యశాలలో శశికుమార్ మాట్లాడారు. ప్రధానిగా మోదీ 11సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని నిరంతర కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్రపార్టీ శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. పేద ప్రజలకు ఉపయోగపడే సంక్షేమపథకాలు అనేకం అమలు జరుగుతున్నాయన్నారు. మారెపల్లి శ్రీనివాస్, దాసరిశ్రీనివాస్, పొట్ల వెంకటి, ఆకుల కుమార్, చొప్పరి లక్ష్మీనారాయణ, ఎస్కే పాష, గంధం శంకర్, అనిల్, అంకం కుమార్, సాయి ప్రణీత్, రమేష్ పాల్గొన్నారు.

నిరంతర కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టిన బీజేపీ

పాలకుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు శనివారం మండలకేంద్రంలో బీజేపి నిరంతర కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామంలో మొక్కలునాటి దేశానికి మోదీ చేస్తున్నసేవలను కొనియాడారు. నాయకులు బాలసాని మల్లేశంగౌడ్, నాగేష్, శంకరయ్య, తిరుపతి, కుమార్, సంతోష్, లక్ష్మణ్, వెంకటేష్, సంపత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ పంచాయతీ కార్మికుడి మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామపంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న కొత్తపల్లి ఎల్లయ్య (56) అనారోగ్యంతో బాధపడుతూ సిరిసిల్లలోని ఓప్రైవేటుఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. ఎల్లయ్య రెండురోజుల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. పరిస్థితి విషమంగా మారడంతో అతడిని సిరిసిల్లకు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

- స్వామివారిని దర్శించుకున్న 70 వేల మంది



రాజన్న దర్శనం కోసం ఆలయం ఎదుట భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి రాజన్న ఆలయానికి సుమారు 70వేలవరకు భక్తులు తరలి వచ్చినట్లు తెలుస్తోంది. ఉదయాన్ని ధర్మగుండంలో భక్తులు పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారుగా నాలుగు గంటలు నిరీక్షించారు. శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు పార్వతిరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. పరివార దేవాలయాల్లో కుంకుమ పూజలో భక్తులు పాల్గొన్నారు. గండాదీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాలను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్లె దవాఖానాల పనులకు సుస్తీ

- బిల్లులు అందడం లేదని నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- స్థల సమస్యతో మరికొన్ని పెండింగ్

కథలాపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పల్లెవాసులకు సకాలంలో వైద్యం అందించాలనే లక్ష్యంతో నిర్మించ తలపెట్టిన పల్లె దవాఖానాల పనులకు సుస్తీ పట్టింది. మండల కేంద్రాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలంటే దూరభారం అవుతున్నందున గ్రామాల్లోనే దవాఖానా నిర్మాణాలకు గత బీఆర్ఎస్ సర్కారు శ్రీకారం చుట్టింది. కథలాపూర్ మండడంలో కాంట్రాక్టర్లు హడావుడిగా పనులు ప్రారంభించినప్పటికీ బిల్లులు సకాలంలో అందకపోవడంతో పనులు అర్ధాంతరంగా వదిలేశారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆ పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరకుండా పోయింది.



దూలూరులో అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణ పనులు

● పల్లెవాసులకు తప్పని దూర ప్రయాణం..

మండలంలోని సిరికొండ, తక్కళ్ళపల్లి, కథలాపూర్, దూలూరు గ్రామాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె దవాఖానాలు మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించగా టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. దూలూరు, సిరికొండ గ్రామాల్లో స్లాబ్‌లెవెల్ దాకా పనులు పూర్తి చేశారు. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి మంజూరు కాక కాంట్రాక్టర్లు పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. నేటికీ ఆ పనులు కొనసాగించక పోవడం వల్ల పల్లెవాసులకు దూరంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లక తప్పడం లేదని వాపోతున్నారు. తక్కళ్ళపల్లి, కథలాపూర్ గ్రామాల్లో స్థల సమస్య తలెత్తిన కారణంగా పనులు ఇప్పటికీ ఆరంభించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక భూషణరావుపేట, తాండ్ర్యాలకు పల్లె దవాఖానాలు మంజూరు కాగా తాండ్ర్యాలలో పనులు కొనసాగిస్తున్నారు. భూషణరావుపేటలో స్థలం ఎంపిక విషయంలో కొంతజాప్యం చోటు చేసుకుంటోంది. వైద్యుడు, స్టోర్‌రూం, రోగిని పరీక్షించే గదులను ప్రత్యేకంగా నిర్మించాలని నిర్ణయించినా నిధుల లేమి సమస్యతో లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకొంది. పల్లె దవాఖానాలకు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని తలపోసినా ఎక్కడా అమలుకు నోచుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిల్లులు వస్తేనే తాము పనులు చేపడతామని కాంట్రాక్టర్లు తెగేసి చెబుతుండడంతో ఎప్పుడు పనులు పూర్తవుతాయో తెలియక పల్లెవాసులు అయోమయంకు గురవుతున్నారు.

● స్థల సమస్యతో పనులు చేపట్టలేదు

- వర్థినేని నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ



పల్లెవాసులకు వైద్యం మరింత చేరువ కావాలనే ఉద్దేశ్యంతో మూడేళ్ల కిందట పల్లె దవాఖానాలు నిర్మించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. కథలాపూర్ మండల కేంద్రంలో ఆ పనులు చేపట్టడానికి ఒప్పందం చేసుకున్నప్పటికీ స్థల సమస్య కారణంగా పనులు ప్రారంభించ లేదు. మరికొన్ని చోట్ల బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల పనులకు అంతరాయం ఏర్పడింది.

ఘనంగా పోచమ్మ, పెద్దమ్మ బోనాలు



కోనరావుపేటలో చేపల వలతో బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్తున్న భక్తులు



నూకపల్లిలో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మెట్‌పల్లి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి రూరల్ మండలంలోని కోనరావుపేట గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. గ్రామదేవతల విగ్రహాల పున ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. పోచమ్మ ఆలయాన్ని మామిడి తోరణాలు, దీపాలతో సుందరంగా అలంకరించారు. గురువారం గ్రామంలోని ఆలయాల్లో 12 విగ్రహాలను పున ప్రతిష్ఠాపన చేయగా వాటికి ఉదయం నుంచి విశేష పూజలు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాడెపు సతీష్, ఉపాధ్యక్షుడు శనిగారపు జగదీష్, కోశాధికారి జక్కుల గణేష్‌లతో పురోహితులు వేద మంత్రాల మధ్య జరిపించారు. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపి ఒడి బియ్యంతో నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మత్స్యకారులవలలు, డప్పు చప్పుల మధ్య మహిళలు బోనం నెత్తిన ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

● **మల్యాల:** మండలంలోని నూకపల్లిలో ఆదివారం పెద్దమ్మ బోనాల వేడుకలో ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం పాల్గొని పెద్దమ్మతల్లికి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేవెంట స్థానికముదిరాజ్ సంఘ ప్రతినిధులు, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఆదిరెడ్డి, ముత్యం శంకర్, శనిగారపుతిరుపతి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ధర్మారం జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దొడ్డు ఇసుకను సన్నగా మార్చి అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌తో పాటు సామాగ్రిని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. నర్సింగాపూర్ శివారులో ఇసుకదందాపై అందిన సమాచారంతో రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఆర్ఐ వరలక్ష్మి దొడ్డు ఇసుకను సన్నగా మార్చుతున్న సామగ్రితోపాటు ఇసుక అక్రమ రవాణ చేస్తున్న ట్రాక్టర్ సీజ్ చేశారు. అక్రమ ఇసుక రవాణ చేస్తున్న పెగడపల్లి గ్రామానికి చెందిన ఆవుల అనీల్‌గా ప్రాథమిక విచారణలో తేలిందని ఆర్ఐ వరలక్ష్మి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామంలోని మోయతుమ్మెద వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా నల్లగొండ గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యాజమని బోయిని చంద్రయ్య, డ్రైవర్ మందశేఖర్‌పై కేసునమోదు చేసినట్టు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాల పంపిణీ

ఎంఈవో శ్రీనివాస్, కొడిమ్యాల



ఆంధ్రజ్యోతి : మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయా?

ఎంఈవో: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలానికి ఎన్ని పాఠ్య పుస్తకాలు వచ్చాయి?

ఎంఈవో: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 10,418 పాఠ్య పుస్తకాలు వచ్చాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి అందరికీ పంపిణీ చేస్తాం.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపునకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: బడి బాట కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

-కొడిమ్యాల

బాధితుడికి పరామర్శ

గొల్లపల్లి, జూన్8 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలంలోని ఇస్రాజ్ పల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కందుకూరు తిరుపతి కొన్ని రోజుల క్రితం ప్రమాద వశాత్తు గాయపడగా అతడిని ఆదివారం తెలుగు దేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి భార్గవ్ నాయకులతో కలిసి పరామర్శించాడు. ఈయన వెంట రాష్ట్ర నాయకులు బత్తుల ప్రదీప్ మండల అధ్యక్షుడు గర్వందుల రవి గౌడ్ స్వామి, కొత్తూరు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

మెట్‌పల్లిటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 10 వ తరగతి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన 36మంది విద్యార్థులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెడల్, ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. వేద పండితుల ద్వారా విద్యార్థులకు ఆశీర్వచనాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు లింబాద్రి పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు, గౌరవ అధ్యక్షులు కోట సుమన్, ప్రధాన కార్యదర్శి ఎలిమి రవి, కోశాధికారి దొంతుల లక్ష్మి నారాయణ, సంయుక్త కార్యదర్శి కొత్త నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అడ్లూరికి మంత్రి పదవిపై సంబరాలు



జగిత్యాలలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు



కోరుట్లలో సంబరాల్లో పాల్గొన్న దళిత సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి రావడం పట్ల జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. స్థానిక ఇందిరా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, గాజుల రాజేందర్, నేహల్, రఘువీర్, గుండా మధు, చాంద్, ముజీబ్, కొంద్ర రాజేశ్, కొత్తకొండ రవి, తదితరులు పాల్గొన్నారు.

●**జగిత్యాల అర్బన్:** మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను జగిత్యాల జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట న్యాయవాది రామచందర్‌గౌడ్, గొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

●**కోరుట్ల:** రాష్ట్ర మంత్రి వర్గంలో దళిత ఎమ్మెల్యేకు స్థాన కల్పించడాన్ని స్వాగతిస్తూ ఆదివారం దళిత సంఘాల నాయకులు సంబరాలు జరిపారు. కోరుట్ల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఎంఆర్‌పీఎస్, అంబేడ్కర్ సంఘ నాయకులు శనిగారపు రాజేష్, ఎర్ర శంకర్, చిట్యాల లచ్చయ్యలతో నాయకులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మెట్‌పల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది అల్లూరి దివాకర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

●**మెట్‌పల్లి రూరల్:** మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివారం మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డం లక్‌పతిరెడ్డి, మారు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుర్ర రాములు గౌడ్, సంధి మల్లారెడ్డి, చాట్ల భాస్కర్, బండారి శ్రీనివాస్, తడగొండ రాజు, కడారి తిరుపతి, పూసాల తిరుపతి, చెట్ల కిషన్, మహేష్, అంజయ్య, అనీల్ గౌడ్, స్వామి, మధుసూదన్ రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** మండల కేంద్రానికి చెందిన యువకులు హైదరాబాద్‌లోని మినిస్టర్ కార్యాలయంలో ధర్మపురి నియోజకవర్గ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆదివారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అనంతరం నక్క విజయ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మాదిగ కులస్థులను పట్టించుకోలేదన్నారు. కానీ నేటి ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనాభాలో అత్యధిక శాతం ఉన్న మాదిగ కులస్థులను అర్థం చేసుకున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను చేపట్టడం హర్షణీయమన్నారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వడం నిజంగా యావత్ తెలంగాణలో ఉన్న మాదిగ సామాజిక వర్గానికి సన్మానం జరిగినట్టుగానే భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చిర్ర దిలీప్ గారు తడగొండ విజయ్ బంగారు దీప దావుల రాజు తదితరులు పాల్గొన్నారు.

●**బుగ్గారం:** ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల యూత్ అధ్యక్షులు సిగిరి అంజిత్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం నాయకులు టపాకాయలు పేల్చి సంబరాలు జరిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

●**వెల్గటూర్:** అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల నాయకులు ఆయనను మినిస్టర్స్ క్వాటర్స్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అడ్లూరికి మంత్రి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, మెరుగు మురళి, బందెల ఉదయ్, గుండాటి సందీప్‌రెడ్డి, గంద్ర శ్రీకాంత్‌రావు, గుమ్ముల వెంకటేష్, లకుమల్ల సాయి పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లు నిరు పేదలకు వరం'

కోరుట్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరు పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం కోరుట్ల మండలంలోని పైడిమడుగు, జోగినిపల్లి, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో జువ్వాడి కృష్ణారావు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. వెంకటాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇండ్ల నిర్మాణ పనులను ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ గౌడ్, మహిపాల్, రాజేశం, జనార్ధన్, రవీందర్ రెడ్డిలతో పాటు నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

కొడిమ్యాల, జూన్8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలో ఆదివారం 18మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గ్రామ కార్యదర్శి బుచ్చయ్య, మాజీ సర్పంచ్ మ్యాకల లతమల్లేశంయాదవ్ భూమి పూజ చేసి ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా పలువురు ఇందిరమ్మ లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని కార్యదర్శి కోరారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్‌రెడ్డి, నర్సయ్య, మల్లారెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

30 వరకు రేషన్‌బియ్యం పంపిణీ

మెట్‌పల్లి రూరల్, జూన్, 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న మూడు నెలల రేషన్ బియ్యం జూన్ 30 వరకు అందజేయడం జరుగుతుందని మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలంలో ఎక్కువగా వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ వారు అందించిన సమాచారం మేరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకే నెలలో అందించే విధంగా రాష్ట్ర పౌర సరఫరాల అధికారులు సూచనలు చేశారు. దీంతో మూడు నెలలకు సంబంధించిన మూడు బయోమెట్రిక్ వేలి ముద్రలకు ఒక్కో దానికి కనీసం సమయం గ్యాప్ అవసరం ఉన్నందున మూడు నెలల రేషన్ ఒకే సారి అందించాలి, సాఫ్ట్ వేర్ అప్డేట్ లోపం కారణంగా ఏమైనా ఆలస్యం అయితే కార్డు లబ్ధిదారులు సంయమానం పాటించాలన్నారు. రేషన్ డీలర్లకు లబ్ధిదారులు సహకరిస్తూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వామ్మో జూన్

(5వ పేజీ తరువాయి)

వల్ల చిన్న పిల్లలు, పెద్దల్లో సైతం వాంతులు, విరేచనాలు, జ్వరాల వంటివి రావడానికి ఆస్కారం ఏర్పడుతుంది. దీని వల్ల ఆసుపత్రులు, ల్యాబ్‌ల ఖర్చులతో పాటు మందులకు అధికంగా వ్యయం చేయాల్సి ఉంటుంది.

జూన్‌లో ఆర్థిక భారం ఎక్కువ..

-అడిగొప్పుల రజిని, గృహిణి, మెట్‌పల్లి



ప్రతీ యేడాది జూన్‌లో అటు పిల్లల బడి ఫీజుల, ఇటు ఇంటి ఖర్చులు ఎక్కువవుతుంటాయి. దీంతో ఆర్థిక భారం ఎక్కువగా ఉంటుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు జూన్‌లో ఆర్థిక కష్టాలు ఎదురవుతుంటాయి.

ఫీజులను నియంత్రించాలి..

-దొనికెల నవీన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులను ప్రభుత్వం నియంత్రించాలి. రూ.లక్షల్లో ఫీజులు ఉండడం వల్ల తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం పడుతోంది. పిల్లలను మంచి స్కూళ్లలో చదివించి ప్రయోజకులను చేయాలని తల్లిదండ్రులు కార్పొరేట్ బాట పడుతున్నారు. వారిలో ఉన్న బలహీనతను ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి.

వ్యవసాయ పెట్టుబడుల భారం..

-నోముల రాజేశ్వర్‌రావు, రైతు, లక్ష్మీదేవిపల్లి



వర్షాకాలం ప్రారంభం అయిందంటే వ్యవసాయ పనులు మొదలు పెట్టాల్సి ఉంటుంది. దీంతో వ్యవసాయ పెట్టుబడులు అవసరమవుతుంటాయి. ఏ యేటికి ఆ యేడు వ్యవసాయ పెట్టుబడులు వివిధ కారణాల వల్ల పెరుగుతున్నాయి. దీంతో అప్పులు చేసి సాగుకు పెట్టుబడులు పెడుతున్నాం.

పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం



విద్యార్థినికి ఆర్థిక సహాయం చేస్తున్న యూత్ సభ్యులు

బీర్‌పూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గుండ నందిని అనే నిరుపేద విద్యార్థినికి ఆదివారం బీర్‌పూర్ గ్రామానికి చెందిన యువ చైతన్య యూత్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందించారు. నందిని చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. ఆత్మస్థైర్యం కోల్పోకుండా పట్టుదలతో చదివి బీర్‌పూర్ పాఠశాలలో 10వతరగతి ఫలితాల్లో టాపర్‌గా నిలిచి ఉత్తమ విద్యార్థినిగా పేరు తెచ్చుకుంది. అంతే కాకుండా ఐఐఐటీలో సీటు కూడా తెచ్చుకొని చదువులు కొనసాగిస్తుంది. విద్యార్థినికి ఆర్థిక ఇబ్బందులు రాకుండా చూడాలనే ఉద్దేశంతో యూత్ సభ్యులు 5వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించి నందినిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు కాలువ హరీష్, యూత్ సభ్యులు తదితరులు ఉన్నారు.

పశువులను వధిస్తే కఠిన చర్యలు

రాయికల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా వధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాయికల్ ఎస్సై సుధీర్‌రావు పేర్కొన్నారు. రాయికల్ పట్టణ శివారులో కొందరు పశువులను ఆదివారం ఉదయం వధిస్తున్నారన్న సమాచారం మేరకు అక్కడికి చేరుకుని పశు వధకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పశు వధకు పాల్పడుతున్నారని, అట్టి వారిపై చర్యలు తీసుకోవాలని కొందరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నామని ఎస్సై వివరించారు.

భూసార పరీక్షలపై అవగాహన



రాయపట్నంలో భూసార పరీక్షలు

ధర్మపురి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భూసార పరీక్షల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ భూమి యొక్క సారాన్ని పరీక్షించి తెలుసుకునే పద్ధతిని భూసార పరీక్ష అంటారని అన్నారు. రైతులకు ఒక ఫీల్డులో మట్టి నమూన ఎలా తీయాలో ఆయన చూపించారు. ఏ పంట వేస్తే బాగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకుని మంచి దిగుబడి ఇచ్చే పంటను పండించే అవకాశం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయిల్ల శ్రీనివాస్, పాయిల్ల శరత్, గడ్డం అనిల్, అక్కల నరేష్, మోటపలుకుల తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

చేప మందు పంపిణీ

జగిత్యాల క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింత కుంట చెరువు సమీపంలో ఉన్న సూర్యభగవాన్ ఆలయంలో మృగ శిర కార్తెను పురస్కరించుకుని భక్తులకు చేప మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు హాజరై చేప మందును సేవించారు. అనంతరం సూర్య భగవాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.



జగిత్యాలలో చేప మందు పంపిణీ

చేపల మార్కెట్‌లో సందడి

జగిత్యాల అర్బన్: మిరుగు సందర్భంగా ఆదివారం జగిత్యాల పట్టణంలోని చేపల మార్కెట్‌లో చేపల కోసం ప్రజలు ఎగబడ్డారు. మృగ సిరా కార్తె ప్రవేశించిన సందర్భంగా అస్తమా రోగులు చేప మందు తీసుకోవడం ద్వారా వారికి నయం అవుతుండడంతో దశాబ్దాల నుండి హైదరాబాద్‌లో చేప తీసుకోవడం జరుగుతున్నది అందులో బాగంగా మృగసిరా కార్తె ప్రవేశించిన సందర్భంగా ఈ ప్రాంతంలో కూడా కొన్ని సంవత్సరాల నుంచి చేపలు తినడం అనవాయితిగా వస్తున్నది. దీంతో జగిత్యాల పట్టణంలోని చేపల మార్కెట్‌లు చేపలు కొనుగోలు చేసే వారితో కిటకిలాడాయి. జగిత్యాల పట్టణంతో చుట్టూ పక్కల గ్రామాల నుంచి వందలాది మంది జగిత్యాల జిల్లా కేంద్రానికి వచ్చి చేపలను కొనుగోలు చేశారు.

●కోరుట్ల/కోరుట్ల రూరల్: మృగశిర కార్తె పురస్కరించుకొని ఆదివారం చేపల మార్కెట్ జనంతో కిటకిటలాడింది. పట్టణంలోని ఐబి రోడ్డు, కాల్వగడ్డ, కల్లూర్ రోడ్డులతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలోని మార్కెట్‌లలో చేపలు కొనడానికి జనం ఎగబడ్డారు. చేపలు తింటే శ్వాస కోస వ్యాధుల నివారణ జరుగుతుందని చేపలను వండుక తింటారు. కోరమీన్ (కొర మెట్ట) కిలోకు రూ. 600 పలుకగా బొత్త చేప, బంగారు తీగ, రవులు రూ.200, చందమామ, కోడిపెలు రూ.400 వరకు పలికింది. దీనిలో ఉలిచెలు రూ.1200 కిలో వరకు విక్రయించడంతో రికార్డును సృష్టించింది. దీంతో కోరుట్ల చేపల మార్కెట్ సందడిగా మారింది.

ఆలయ పునః నిర్మాణానికి విరాళం

బీర్‌పూర్,జూన్ 8(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పునః నిర్మాణానికి గుడిసె శ్రీలత రమేష్ దంపతులు ఆదివారం స్వామివారిని దర్శించుకుని రూపాయలు 25,001 విరాళంగా ఆలయ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా హైదారాబాద్‌కు చెందిన గుడిసె శ్రీలత రమేష్ దంపతులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను అందించి ఆశీర్వచనాలను అందించారు. ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటాన్ని రమేష్ దంపతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

బడిబాట

కొడిమ్యాల, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి వెళ్లి బడికి రాని పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామాల ప్రముఖులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైద్యుడి మృతి

-జగిత్యాలలో విషాదం

జగిత్యాల అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ నక్క నారాయణ ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. పట్టణంలో గత 30 సంవత్సరాలుగా ప్రముఖ ఫిజిషియన్‌గా సేవలు అందిస్తున్న డాక్టర్ నారాయణ హఠన్మరణంతో జిల్లా కేంద్రంలోని వైద్యులు అందరు దిగ్భ్రాంతికి లోన య్యారు. గతంలో తెలుగుదేశం పార్టీలో కీలక భూమిక పోషించిన డాక్టర్ నారా యణ 2006 సంవత్సరంలో గొల్లపెల్లి జడ్పీటీసీగా గెలుపొందారు. వైద్యవృత్తిలో తన ముద్ర వేసి జగిత్యాల పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా పట్టణంలో ప్రముఖ వైద్యులలో ఒకరిగా పేరు గాంచారు. నారాయణ మృతిపట్ల పట్టణంలోని వైద్యులు అందరు తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





జగిత్యాలలో సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, రాయికల్‌లో..

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాసుగంటి నారాయణరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఎస్‌కేఎన్‌ఆర్) 1997-2000 బ్యాచ్ బీకాం పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను కళాశాల సిబ్బందిని వేడుకకు ఆహ్వానించారు.ఈ సందర్భంగా అధ్యాపకులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అలాగే 25ఏళ్ల క్రితం విద్యార్థులుగా కళాశాలలో ఆటాపాటలతో చేసిన సందడిని గుర్తుచేసుకొని సంబరపడ్డారు. అనంతరం కళాశాల అధ్యాపకులను, సిబ్బందిని పూర్వ విద్యార్థుల బ్యాచ్ పక్షాన శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మోర హన్మండ్లు, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, చెన్న గణేష్, లక్ష్మణ్, నరేందర్, డాక్టర్ అర్వపల్లి రాజేశ్వర్, అవారి శంకరయ్య తో పాటు 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

●**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం లోని పొరండ్ల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పదోతరగతి 2012-2013 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అలరించింది. పూర్వ విద్యార్థులు ఒక్కచోట కలిసి ఆనాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. దీంతో సందడి వాతావరణం చోటుచేసుకుంది. 12 సంవత్సరాల తర్వాత పూర్వవిద్యార్థులు చిన్నారులుగా మారి ఆనాటి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. తమ ఎదుగుదలకు తోడ్పడిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. ఈకార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**రాయికల్:** రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని హైస్కూల్‌లో 2003-04 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు 21 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు ముందుగా కరోనా విపత్కర కాలంలో తమ తోటి విద్యార్థి జవ్వాజి నర్సయ్య కరోనాతో చనిపోగా ఆయనను గుర్తు చేసుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి, మెమోంటో అందజేశారు. తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా గడిపారు.

●రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలులో పదవ తరగతి 2009-10 బ్యాచ్ విద్యార్థినులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15 సంవత్సరాల కలుసుకున్న వీరు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు బూస జమునా దేవి, గుండేటి తరంగిణి, వెంకటలక్ష్మి, శ్రీలత, దేసి రాణి, లక్ష్మి, ఉమ, అరుణ తదితరులను ఘనంగా సన్మానించారు.

'బాలయ్య ఆదర్శప్రాయుడు'

మెట్‌పల్లి రూరల్, జూన్8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీ రామకృష్ణ సంకీర్తన మండలి సభ్యుడు గాజంగి బాలయ్య అందరికి ఆదర్శ ప్రాయుడని శ్రీసత్యానంద ఆశ్రమ పీఠాధిపతి ఆచార్య శ్రీహరితీర్థస్వామి అన్నారు. ఆదివారం గ్రామంలో శ్రీ రామకృష్ణ సంకీర్తన మండలి గాజంగి రాజమల్లయ్య, సభ్యులు ఆధ్వర్యంలో నిర్వమించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఆయన హాజరై అధ్యక్షత వహించారు. అయనతో పాటు వ్యక్తులు శివరామకృష్ణ తపోవనం పీఠాధిపతి శ్రీవిరజానందతీర్థ స్వామి, చింతకుంట సత్యానంద ఆశ్రమ శ్రీవిశ్వకతీర్థస్వామి, మాతీ శారదానంద, మాత పరమేశ్వరి, మాత హరిప్రియనంద, మాత సువందిత తీర్థలు పాల్గొని ముందుగా ఉదయం భగవద్గీత సంపూర్ణ పారాయణ చేశారు. అనంతరం బాలయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలయ్య గ్రామాన్ని భక్తి భావనతో పాటు పవానం చేసారని, ఆయన జీవనం మనందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సంకీర్తన మండలి సభ్యులు పాల్గొన్నారు.